

బ్రహ్మోత్సవాలలో నేడు:
ఉదయం: 8-10మధ్య కల్పవృక్ష వాహనం
మధ్యాహ్నం: 1-3మధ్య స్నపన తిరుమంజనం
రాత్రి: 7-9మధ్య సర్వభూపాల వాహనం



కాళీయమర్ధనుడిగా మలయప్ప కటాక్షం

● పెరిగిన భక్తుల రద్దీ

బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం ఉదయం సింహవాహనంపై యోగనరసింహుడిగా దర్శనమిచ్చిన మలయప్ప.. రాత్రి ముత్యపుపందిరిలో కాళీయమర్ధనుడి అలంకారంలో భక్తులను కటాక్షించారు. తెల్లటి ముత్యాల నడుమ విశేష అలంకరణలో శ్రీ,భూ సమేతుడై గ్యాలరీల్లో ఉన్న భక్తులను అనుగ్రహించారు. ఉదయం, రాత్రి వాహన సేవల్లో భక్తులు అధికంగా పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఇక, బుధ, గురువారాల్లో తిరుమలలో భక్తుల రద్దీ చాలా సాధారణంగా కనిపించింది. శుక్రవారం మాత్రం రద్దీ పెరిగింది. ఉదయం వాహన సేవలోనే భక్తులు గ్యాలరీల నిండుగా కనిపించారు. రాత్రి వాహన సేవకు రెట్టింపయ్యారు. వాతావరణం చల్లగా ఉండడంతో టీటీడీ అందజేసిన అన్నప్రసాదాలు స్వీకరిస్తూ గ్యాలరీల్లోనే కూర్చుండిపోయారు. కళాబృందాలు కూడా ఉదయం కంటే రాత్రి వాహనసేవలో మరింత ఉత్సాహంతో ప్రదర్శనలిచ్చాయి. పెరటాసి రెండవ శనివారంతో పాటు ఆదివారం గరుడసేవ కావడంతో రద్దీ క్రమంగా పెరుగుతోంది. శనివారం సాయంత్రానికి రద్దీ మరింత పెరిగే అవకాశముందని టీటీడీ అంచనా వేస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







తగ్గిన హుండీ ఆదాయం

తిరుమల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం బుధవారం ధ్వజారోహణం రోజున బాగా తగ్గింది. ఉపరాష్ట్రపతి, సీఎం సహా వీవీఐపీలు చాలా మంది తిరుమలలో ఉన్న ఆరోజు భక్తుల సంఖ్య 58వేలు మాత్రమే. గురువారం పరకామణి లెక్కింపులో రూ.1.74 కోట్లు లభించింది. గత రెండేళ్లలో ఒకేరోజు ఇంత తక్కువ హుండీ ఆదాయం ఇదే మొదటిది.

ముక్కంటి హుండీలో నగదు చోరీకి యత్నం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముక్కంటి సన్నిధిలోని హుండీలో శుక్రవారం ఓ భక్తుడు సమర్పించే నగదును తస్కరించేందుకు యత్నించిన వ్యక్తి పట్టుబడ్డాడు. అన్నమయ్య జిల్లా రామసముద్రం గ్రామానికి చెందిన వీరప్ప నారాయణ శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చాడు. స్వామి దర్శనానంతరం సహదేవరెడ్డి అనే భక్తుడు రూ.200 హుండీలో వేస్తుండగా.. అక్కడే చేయి పెట్టిన వీరప్ప.. ఆ భక్తుడు వదలిన రూ.200 నోటును పట్టుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని సహదేవ రెడ్డి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వీరప్ప నారాయణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి వెల్లడించారు.

నారావారిపల్లె ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంపు

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెలో ప్రస్తుతమున్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆస్పత్రిని 50 పడకలకు పెంచుతూ అదనంగా 18 పోస్టులు ఏర్పాటు చేయాలని గత నెల 19న ఏపీ స్టేట్ సెకండరీ హెల్త్ విభాగం డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీనిపై కసరత్తు చేసిన ప్రభుత్వం రాష్ట్రంలోని 50 పడకల కమ్యూనిటీ ఆస్పత్రుల్లో సిబ్బంది సంఖ్యను సమీక్షించి సర్దుబాటు చేసింది. అందులో భాగంగా డెంటల్, గైనిక్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, ఆప్తాల్మజీ వంటి తొమ్మిది విభాగాలకు చెందిన వైద్యుల పోస్టులను, నాలుగు కింది స్థాయి సిబ్బంది పోస్టులను, ఐదు స్టాఫ్ నర్సు పోస్టులను నారావారిపల్లెకి సర్దుబాటు చేసింది. మొత్తం 18 అదనపు పోస్టులతో నారావారిపల్లె ఆస్పత్రిని 50 పడకలకు పెంచుతూ శుక్రవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.







పరిశ్రమల్లో స్థానికులకు 30 శాతం రిజర్వేషన్ కల్పించాలి

పరిశ్రమల్లో స్థానికేతరులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ స్థానికుల పొట్ట కొడుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమల్లోనైనా స్థానికులకు 30 శాతం రిజర్వేషన్ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. భూములిచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సహకరించిన స్థానికులకు న్యాయం చేయాలి.


- సుధీర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

టీడీపీ సానుభూతిపరులని అసైన్‌మెంట్ భూములను హోల్డ్ చేశారు

ఉమ్మడి నెల్లూరు జిల్లా కలువాయి మండలం మాదన్నగారిపల్లి, రామన్నగారిపల్లి గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన 200 మంది రైతులకు 30 ఏళ్ల క్రితం అసైన్‌మెంట్ పట్టాలు మంజూరు చేశారు. వీరు సాగు చేసుకుంటూ, బ్యాంకుల నుంచి రుణాలూ తెచ్చుకున్నారు. ఈ రైతులు టీడీపీ సానుభూతిపరులని, వైసీపీ హయాంలో ఆ భూములను ప్రభుత్వ రికార్డుల్లో నుంచి తొలగించి హోల్డ్‌లో పెట్టారు. దీనివల్ల వన్ బీ రాకపోవడంతో బ్యాంకు రుణాలను రెన్యువల్ చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టి పెట్టి రైతులకు న్యాయం చేయాలి.

- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి ఎమ్మెల్యే

దేవుణ్ని చూడగానే కళ్లల్లో నీళ్లొచ్చాయి



● బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్

'దేవుణ్ని చూడగానే కళ్లలోంచి నీళ్లు తన్నుకుని వచ్చాయి. గొప్ప సంతోషంతో మనసు నిండిపోయింది. అదొక దివ్యానుభూతి' అని తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనం తర్వాత బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అన్నారు. శుక్రవారం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, స్వామిని చూసి బయటకు వచ్చిన తర్వాత మనసు మొత్తం దేవుడి ప్రేమ, రూపం నిండిపోయాయన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా చేసిన అలంకరణలు చాలా బాగున్నాయన్నారు. కాగా, అంతకుముందు సినీనటి వాసుకీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

జీఎస్టీ ఫలాలు ప్రతి గడపకూ చేరాలి

ప్రజల్లో అవగాహన కల్పించండి

● జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 తగ్గింపు ఫలాలు ప్రతి గడపకూ చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ప్రయోజనాలపై అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చాలా వస్తువులపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించిందని తెలిపారు. తగ్గిన ధరలు జిల్లాలోని ప్రతిగడపకూ చేరాలని సూచించారు. దీనిపై జిల్లాలో నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, జీఎస్టీ అడిషనల్ కమిషనర్ నాగేంద్ర, డిప్యూటీ కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

'సీమ'లో ఒకే ఒక్కడు

● కామర్స్ పీజీటీ పోస్టు దక్కించుకున్న గిన్నె రవిశంకర్



డీఎస్సీలో కామర్స్ పీజీటీ పోస్టులు రాష్ట్రానికంతా ఉన్నదే నాలుగు. అందులో రాయలసీమ జోన్-4 ప్రాంతంలో ఉన్నది ఒక పోస్టే. ఈ నాలుగు పోస్టులకు పోటీ పడింది 354 మంది. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఒక పోస్టును దక్కించుకున్నారు తిరుపతికి చెందిన గిన్నె రవిశంకర్. తిరుపతిలోని టీటీడీ శిల్పకళాశాల ఇన్‌స్ట్రక్టర్ గిన్నె సాగర్, అలివేలు కుమారుడు, పూలవానిగుంటకు చెందిన రవిశంకర్.. ఎస్వీయూలో ఎంకాం చదివారు. ఆ తర్వాత బీఈడీ చేశారు. తిరుపతిలోని భారతీయ విద్యాభవన్‌లో పీజీటీ (అకౌంటెన్సీ)గా పనిచేస్తున్నారు. మెగా డీఎస్సీలో ఆదర్శ పాఠశాలల్లో కామర్స్ పీజీటీ పోస్టులు రాష్ట్రంలో నాలుగంటే నాలుగు ఖాళీగా ఉన్నాయి. పోటీ ఎక్కువగా ఉన్నప్పటికీ పట్టుదలతో సాధన ప్రారంభించారు. 62.05 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో.. రాయలసీమజోన్ స్థాయిలో ఒకటో స్థానంలో నిలిచారు. ఇలా రాయలసీమ జోన్‌లో ఉన్న ఒకేఒక్క పోస్టును కైవసం చేసుకున్నారాయన. 'మెగా డీఎస్సీలాంటి బంగారు అవకాశాన్ని వదులుకోకూడదని భావించా. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని రోజుకు 6 నుంచి 8 గంటలు చదివా. రాష్ట్రంలోని నాలుగు పోస్టుల్లో ఒకటి సాధించడం చాలా ఆనందంగా ఉంది' అని రవిశంకర్ పేర్కొన్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

నిషేధిత జాబితా నుంచి గ్రామకంఠాలకు విముక్తి

● శ్రీకాళహస్తిలో 22ఏ నుంచి 630 ఎకరాల తొలగింపు



కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితా నుంచి గ్రామకంఠాలకు విముక్తి లభిస్తోంది. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్‌లో 630 ఎకరాలను 22ఏ నుంచి తొలగించడంతో ఈ ప్రక్రియ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా రెండు వేల ఎకరాలను తొలగించి పేదలకు లబ్ధి కలిగించే చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. గతంలో గ్రామకంఠంలో ఇళ్లు కట్టుకున్న భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూసదస్సుల్లో గ్రామకంఠాల్లో నివసిస్తున్న వారి నుంచి కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్‌లోని 192 గ్రామ కంఠాల్లో ఉన్న 630 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్లు ఆయా గ్రామాలను సందర్శించి పునఃసర్వే చేసి భూముల వివరాలను అప్‌డేట్ చేశారు. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల ఆయా గ్రామాల్లోని 19వేల కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఇక, వీరు ఆయా భూములపై బ్యాంకు రుణాలు పొందడంతో పాటు రిజిస్ట్రేషన్లూ చేసుకోవచ్చు. ఇలా జిల్లా వ్యాప్తంగా నిషేధిత జాబితాలో ఉన్న గ్రామకంఠాల్లోని రెండు వేల ఎకరాలకుపైగా ఉన్న భూములను 22ఏ నుంచి తొలగించి పేదలకు లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ చెప్పారు.

శరన్నవరాత్రి అలంకరణలు



తిరుపతి: మహాలక్ష్మిగా తాతయ్యగుంట గంగమ్మ



శ్రీకాళహస్తి: శ్రీలలితాదేవిగా కనకదుర్గమ్మ



సూళ్లూరుపేట: మహాలక్ష్మిగా చెంగాళమ్మ అమ్మవారు



చిల్లకూరు: కాత్యాయిని దేవిగా తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ

తిరుపతి

జీఎస్టీ-2.0 తగ్గింపు ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



తిరుపతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తగ్గించిన సూపర్ జీఎస్టీ-2.0 వలన కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై చేపట్టాల్సిన అవగాహన కార్యక్రమాలపై శుక్రవారం నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఏయే వస్తువుల ధరలు తగ్గాయనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్ పాల్గొన్నారు.

జీఎస్టీ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్‌గా ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గుదల చేసిందని, శనివారం నుంచి 15 రోజులపాటు 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ అన్నారు. శుక్రవారం తిరుపతిలోని ఆమె నివాసంలో పార్టీ నాయకులతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, రాష్ట్ర నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, మన్నెం శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, శ్రీహరినాయుడు, వేణుగోపాల్ నాయుడు, ఊట్ల సురేంద్ర నాయుడు, అరగొండ చంద్ర, ఆనంద్‌బాబు యాదవ్, విశ్వనాథం, ఆముదాల తులసీరాం, పుష్పావతి, బ్యాంకు శాంతమ్మ, హేమావతి, అనిత, రేవతి, సుజాతమ్మ పాల్గొన్నారు.

దోబీఘాట్‌లో పారిశుధ్య చర్యలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మధురానగర్ దోబీ ఘాట్‌లో శుక్రవారం మున్సిపల్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. దోబీఘాట్‌లో నెలకొన్న సమస్యలపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'సమస్యల దోబీఘాట్' వార్తపై హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ స్పందించారు. ఆయన అక్కడికి చేరుకుని పరిస్థితిని గమనించారు. మురికినీరు వెళ్లే కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తాచెదారం శుభ్రం చేయించారు. కాలువ చుట్టూ మొలచిన పిచ్చి మొక్కలను తొలగించారు. దోమలు వ్యాప్తి చెందకుండా మలాథియాన్ స్ప్రే చేయించారు.

నేడు గుర్రం జాషువా జయంతి

తిరుపతి(విద్య), సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కవి కోకిల గుర్రం జాషువా జయంతి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ప్రముఖ కవులు, రచయితలు హాజరుకానున్నారని వెల్లడించారు.

ప్రాజెక్టులపై సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై సంబరాలు, సీజనల్ కండిషన్స్, పీఎం కుసుమ్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్, విండ్ ప్రాజెక్టులకు సంబంధించి సమీక్షించారు. జేసీ శుభం బన్సల్, జీఎస్టీ రీజనల్ కమిషనర్ నాగేంద్ర, అడిషనల్ కమిషనర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు.

జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి బాధ్యతల స్వీకరణ

తిరుపతి (కలెక్టరేట్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిగా ఎన్.చిన్నరెడ్డెయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిన్నరెడ్డెయ్య

5న భక్త కనకదాసు విగ్రహావిష్కరణ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ బస్టాండు ముందున్న కూడలిలో అక్టోబర్ 5వ తేదీన భక్త కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు కమిటీ ప్రతినిధులు మంగిరి రెడ్డెప్ప, కేవీ రమణ తెలిపారు. వారు శుక్రవారం విగ్రహాన్ని, సభాస్థలిని పరిశీలించారు. ముఖ్య అతిథిగా మంత్రి సవితమ్మ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ముందుగా బాలాజీకాలనీలోని జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ కో కన్వీనర్లు ఆవుల రవీంద్ర, ఆర్.మల్లి, పీవీ శంకరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

'అన్నా' కుటుంబానికి ఓదార్పు



నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు నరసింహ యాదవ్, మునికృష్ణ

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యాదవ సంఘ నాయకుడు అన్నా రామచంద్రయ్య ఇంట విషాదం నెలకొనడంతో తిరుపతి నుంచి పలువురు రాజకీయ నాయకులు, యాదవ సంఘ ప్రతినిధులు గుంటూరుకు వెళ్లారు. శుక్రవారం అక్కడ జరిగిన తిరుపతి నగరపాలక సంస్థ కార్పొరేటర్ డాక్టర్ అన్నా సంధ్య యాదవ్ భర్త డాక్టర్ వెంకట కిషోర్, వారి కుమార్తె చిన్నారి అశ్వినందనల అంత్యక్రియల్లో పాల్గొన్నారు. భౌతికకాయాలకు నివాళులర్పించి, అన్నా కుటుంబ సభ్యులను ఓదార్చారు. తీవ్రంగా గాయపడిన కార్పొరేటర్ సంధ్య, ఇతర కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇందులో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నరసింహ యాదవ్, తిరుపతి మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నాయకులు దంపూరు భాస్కర్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, రవితేజ నాయుడు, వైసీపీ నేతలు ఉన్నారు.

చేనేత, హస్తకళ మేళా ప్రారంభం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉపాధ్యాయనగర్‌లోని ఎలైట్ సోషియల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్లో సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేత, హస్తకళ మేళాను శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. 15రోజులపాటు జరిగే ఈ మినీ మేళాలో వివిధ రాష్ట్రాల నుంచి 35మంది కళాకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. జైపూర్ బెడ్‌షీట్స్ ఉత్తరప్రదేశ్ గృహాలంకరణ వస్తువులు, కలంకారి చీరలు, మీరట్, షోలాపూర్ చెప్పులు, ఆంధ్రా కొండపల్లి బొమ్మలు, చేనేత టవల్స్, కాటన్‌చొక్కాలు, ఖాదీటాప్, హైదరాబాదు ప్రింటెడ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్‌తో స్టాల్స్ ఏర్పాటు చేశారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి, నిర్వాహకుడు పైడి మహేష్ కోరారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక మహతి కళాక్షేత్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. అనంతపురం అరవింద్ ఆర్ట్స్ అకాడమి సూర్యప్రసాద్ బృందం భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించింది. పలు భక్తిగీతాలకు చిన్నారుల నృత్యం కట్టిపడేసింది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సప్తగిరి మాసపత్రిక సీనియర్ ఉప సంపాదకులు డాక్టర్ అల్లాడి సంధ్య, ధర్మప్రచార పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారి నృత్య ప్రదర్శన

ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్

వారం రోజులు శేషాచలంలో యాత్ర



ట్రెక్కింగ్‌కు పయనమైన ఎన్‌సీసీ క్యాడెట్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్లు టెక్కింగ్ చేపట్టారు. శుక్రవారం తిరుపతి ఎన్‌సీసీ నగర్ నుంచి బయలుదేరారు. శేషాచలం అడవుల్లో అక్టోబరు 2వ తేదీ దాకా ఈ ట్రెక్కింగ్ సాగనుంది. దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు పాల్గొన్నారు. ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా టెక్కింగ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణం, సంస్కృతి పట్ల అవగాహనకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.



తాతయ్యగుంట గంగమ్మ మూలవిరాట్టుకు మహాలక్ష్మీదేవి అలంకరణ - మహాలక్ష్మీదేవి అలంకారంలో వేశాలమ్మ, నడివీధి గంగమ్మ దర్శనం - ధనలక్ష్మి అలంకరణలో అన్నపూర్ణదేవి - మహాలక్ష్మీదేవి అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి

మహాలక్ష్మిగా తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు మహాలక్ష్మీదేవి అలంకారం చేసి, భక్తులకు దర్శనం కల్పించి, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయం ముందుండే మండపంలో హోమ పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి మహాలక్ష్మీదేవి అలంకరణ చేసి, ఊంజల్ సేవ నిర్వహించారు. హోమ పూజల్లో ఆలయ పాలకమండలి ఛైర్మన్ నైనారు మహేష్ యాదవ్, సభ్యులు, ఈవో జయకుమార్ పాల్గొన్నారు. అలాగే కోర్టు సమీపంలోని వేశాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మహాలక్ష్మీదేవి అలంకారం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. గాంధీవిగ్రహం సమీపంలోని పెద్దగంగమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులకు అభయప్రదానం చేశారు. పాత మున్సిపల్ ఆఫీసు అనుకుని ఉండే నడివీధి గంగమ్మ కూడా మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక కపిలేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గాయత్రీదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆయా ఆలయాల్లో పాల్గొని పూజలు చేయించారు. పిండి, నిమ్మకాయ దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ధనలక్ష్మిగా అన్నపూర్ణాదేవి

తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. దాదాపు రూ.10లక్షల(రూ.500, రూ.200, రూ.100, రూ.50, రూ.20, రూ.10, రూ.5నోట్ల)తో అమ్మవారిని, ప్రాకారాన్ని అలంకరించారు. కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలమూర్తి మహాలక్ష్మీదేవిగా, ఉత్సవమూర్తి ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు అభయమిచ్చారు. శుక్రవారం కావడంతో ఆలయాల్లో మహిళా భక్తుల సందడి కనిపించింది.



తాతయ్యగుంట గంగమ్మ ఆలయ హోమపూజల్లో పూజా ద్రవ్యాలను సమర్పిస్తున్న పాలకమండలి సభ్యులు

లక్ష్మీదేవిగా బొంతాలమ్మ

తిరుపతి(జీవకోన), (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీదేవి అలంకరణలో బొంతాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా చిలకమర్తి జయంతి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయ దక్షిణ మాడవీధిలోని చిగోర ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో శుక్రవారం ప్రముఖ రచయిత, సంఘ సంస్కర్త చిలకమర్తి లక్ష్మీనరసింహారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. చిగోరా సేవా కేంద్రం వ్యవస్థాపకుడు హనుమంతరావు, రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రవీంద్ర, మస్తాన్, లీలావతి పాల్గొన్నారు.

స్విమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. శుక్రవారం స్విమ్స్ ఆస్పత్రి ఆవరణలో కార్మికుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మురళి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై మూడు నెలల క్రితం పోరాటం చేశామని, రోగులకు ఇబ్బంది కలిగించొద్దన్న ఉన్నతాధికారుల విజ్ఞప్తి మేరకు విరమించామని చెప్పారు. మూడు నెలలు గడుస్తున్నా అధికారుల్లో ఎలాంటి చలనమూ లేకపోవడం అన్యాయమన్నారు. అక్టోబరు 5వ తేదీలోపు కార్మికులను లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్‌లోకి బదిలీ చేయాలని, వేతనాలు పెంచాలని, శానిటేషన్ హోదాను మార్చాలని కోరారు. లేనిపక్షంలో మళ్లీ ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రవి, సూరిబాబు, మాధవ్, వేణు, బుజ్జి ప్రసంగించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని వేదాంతపురం, అవిలాల సెక్షన్ల పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ సి.గంగాధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటేరు, గజలక్ష్మీ కాలనీ, వేదాంతపురం, అవిలాల, బాయమ్మతోట సమీప ప్రాంతాలు, ఎమ్మార్‌పల్లె పోలీస్‌స్టేషన్ ప్రాంతం, వాణినగర్, ధనలక్ష్మీనగర్, చక్రాగార్డెన్స్, అవిలాల, అంబేడ్కర్ కాలనీ, ఇంజనీర్స్ లేఅవుట్, సుబ్బయ్య కాలనీ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళలపై ఆగడాలను అరికట్టండి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, దాడులు, వేధింపులు, హత్యలను అరికట్టాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఐద్వా నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు 12 గంటల పని విధానం అమలు చేసేలా అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని తప్పుబట్టారు. 8గంటల పని విధానం కోసం మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఆడపిల్లల నిష్పత్తిని పెంచడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకురాళ్లు జయంతి, సుజాతమ్మ, గురవమ్మ, లత, బుజ్జమ్మ, డి.హేమలత, చెంచులక్ష్మి, ఎస్.షకీల, రమాదేవి పాల్గొన్నారు.

యువ తరంగ్-2025కు రండి

మంత్రి రాంప్రసాదరెడ్డికి ఎస్వీయూ ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో అక్టోబరు 16 నుంచి చేపట్టే యువతరంగ్-2025కు అతిథిగా రావాలని మంత్రి రాంప్రసాద రెడ్డిని యూనివర్సిటీ కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ శుక్రవారం ఆహ్వానించారు. ఇందుకు మంత్రి సమ్మతించారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆయన వెంట ఉన్నారు.





వ్యవసాయ కాలేజీ డీన్‌గా రెడ్డి శేఖర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కాలేజీ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ రెడ్డి శేఖర్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలువురు అభినందించారు.

ఎస్వీయూ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ స్టోర్స్ కమిటీ ఛైర్మన్‌గా శివప్రసాద్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ స్టోర్స్ కమిటీ ఛైర్మన్‌గా కె.శివప్రసాద్ నియమితులయ్యారు. ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్మన్‌గా కె.శివప్రసాద్, సభ్యులుగా కె.నాగరాజు, టి.విజయ సారథిని నియమించారు. త్వరలో ఈ కమిటీ బాధ్యతలు స్వీకరించనుంది.

బాలకృష్ణ వ్యాఖ్యలపై వైసీపీ నిరసన

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణకు వ్యతిరేకంగా భూమన కరుణాకర్‌రెడ్డి నివాసం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని వైసీపీ చేపట్టింది. బాలకృష్ణ చిత్రంతో కూడిన బ్యానర్‌ను తగులబెట్టేందుకు వైసీపీ శ్రేణులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. నిరసన చేపట్టిన వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో నగర వైసీపీ అధ్యక్షుడు మల్లం రవిచంద్రా రెడ్డి, వైసీపీ నేతలు పసుపులేటి సురేష్, మద్దాలి శేఖర్, లవ్లీ వెంకటేశ్వర్లు, తలారి రాజేంద్ర, దినేష్ రాయల్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



నీట్, జేఈఈ-2026 డిజిటల్ మెటీరియల్ సిద్ధం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నీట్, జేఈఈ-2026 పరీక్షలు రాయాలనుకుంటున్న విద్యార్థుల కోసం డిజిటల్ మెటీరియల్‌ను సిద్ధం చేసినట్టు ఐఐటీ - జేఈఈ, నీట్ ఫోరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. కాన్సెప్ట్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, గ్రాండ్ టెస్ట్‌లు ఉన్నాయని వెల్లడించారు. నీట్‌కు సంబంధించి మునుపటి టెస్ట్ అండ్ సొల్యూషన్స్, పేపర్స్, ర్యాంక్ బూస్టర్ టెస్ట్, ఎన్‌సీఈఆర్టీ నీట్ క్వశ్చన్ బ్యాంక్, టెస్ట్ సిరీస్‌ను పొందుపరిచినట్టు వివరించారు. మరింత సమాచారం కోసం అభ్యర్థులు నీట్-2026, జేఈఈ అభ్యర్థులు జేఈఈ 2026 అని టైప్‌చేసి 98490 16661కు వాట్సప్ మెసేజ్ పంపించాలని సూచించారు.

మహాలక్ష్మి అలంకరణలో తిరుపతి గంగమ్మ



భాకరాపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చిన్నగొట్టిగల్లు కట్టపై కొలువైన తిరుపతి గంగమ్మ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, అర్చనల అనంతరం విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

భవనంపై నుంచి పడి ప్లంబర్ మృతి



మృతుడు రాజేంద్రప్రసాద్ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పరిధిలోని తిరుపతి-పీలేరు జాతీయ రహదారిలో ఉన్న ఓ ప్రైవేటు కళాశాల భవనంపై నుంచి కింద పడి ఓ ప్లంబర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ముంగిలిపట్టు హరిజనవాడకు చెందిన రాజేంద్రప్రసాద్ ఓ ప్రైవేటు కళాశాలలో ప్లంబర్ పనులు చేస్తున్నాడు. రెండవ అంతస్తులో పైప్‌లైన్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కళాశాల సిబ్బంది రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెర్లోపల్లె సర్పంచ్ బాధ్యతల స్వీకరణ



తిరుపతిరూరల్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం చెర్లోపల్లె గ్రామసర్పంచ్‌గా కె.చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ బి.సుభాషిణి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో వైస్ సర్పంచ్‌గా ఉన్న చంద్రశేఖర్‌కి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈనేపథ్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన్ను పలువురు అభినందించారు. శుభగిరినాయుడు, శ్రీధర్ నాయుడు, వాసుదేవనాయుడు, పంచాయతీ సెక్రటరీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అవిలాలలో వైద్యశిబిరం



తిరుపతిరూరల్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం అవిలాల ఆంధ్రా బ్యాంక్ కాలనీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, నోటిక్యాన్సర్, రొమ్ముక్యాన్సర్, అనీమియా, క్షయ పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు టీకాలు వేశారు. పోషకారంపై మహిళలకు అవగాహన కల్పించారు. గ్రామసర్పంచ్ చెందిలి వెంకటరమణ, దామినేడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుకన్య, సూపర్‌వైజర్ క్రిష్ణప్రియ, సిబ్బంది, టీడీపీ నాయకులు సి.సాంబశివరావు, శ్రీధర్, ఈశ్వర్, నిరంజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై యోగనరసింహుడి విహారం



యోగనరసింహుడి అవతారంలో సింహవాహనంపై ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరుడు

తిరుపతిరూరల్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామివారు యోగ నరసింహుడి అవతారంలో సింహ వాహనంపై విహరించి భక్తులకు అభయమిచ్చారు. వాహనంముందు వృషభాలు నడుస్తుండగా..భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, మంగళ వాయిద్యాలతో కోలాహలంగా సాగింది. రాత్రి ముత్యపు పందిరిలో కొలువుదీరి భక్తులను కటాక్షించారు. పలుగ్రామాలకు చెందిన భక్తులు స్వామివారికి సారె సమర్పించి మొక్కు చెల్లించారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ

తిరుచానూరు, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మ వారిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, ఆలయ సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి గొడుగుల వితరణ



తిరుచానూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి శుక్రవారం రాత్రి రెండు గొడుగులను చెన్నైకి చెందిన భక్తులు అందజేశారు. డిప్యూటీ ఈవో హరిందర్‌నాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతికి దాతలు గొడుగులు అందజేశారు. వారికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు.

చంద్రగిరి

మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో అక్టోబరు 3వ తేదీ నుంచి 31 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య కలిగిన నిరుద్యోగ మహిళలు ఈశిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణకు దరఖాస్తు చేసుకొనేవారు కనీసం పదోతరగతి చదివి ఉండాలని తెలియజేశారు. వివరాలకు 7989680587, 9494951289, 6301717672 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

పాకాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాకాల రైల్వే స్టేషన్ ఉప్పరపల్లె సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం రాత్రి గుర్తించారు. జీఆర్పీ ఎస్‌ఐ రత్నమాల కథనం మేరకు.. మృతుడి వయస్సు సుమారు 25-30 సంవత్సరాల లోపు ఉంటుంది. తెల్లని షర్టు మీద నలుపురంగు గీతలున్నాయి. బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. రైలు ఢీకొని మృతిచెందినట్లు తెలుస్తోంది.

మహాలక్ష్మిగా మూలస్థానమ్మ కటాక్షం



పాకాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేంద్రగుంట మూలస్థానమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు ఒకరికి తీవ్రగాయాలు



నుజ్జునుజ్జయిన కారు

చంద్రగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిలోని కాశిపెంట్ల వద్ద కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాల య్యాయి. పోలీసుల కథనం మేరకు..తిరుపతికి చెందిన వాసు తన కారులో చిత్తూరుకు బయలుదేరాడు. కాశిపెంట్ల వద్ద కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. వాసుకి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాలక్ష్మిగా కామాక్షి మాత



రామచంద్రాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోటిలింగేశ్వరాలయంలో కొలువైన కామాక్షి అమ్మవారు, జలకంఠేశ్వరాలయంలో భవానీ అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో శుక్రవారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 10గంటలకు మృత్యుంజయ హోమం, సాయంత్రం అమ్మవారి ఊంజల్ సేవ జరిగింది. శ్రీశక్తిపీఠంలో వెలసిన మరకతశక్తి కాళీ అమ్మవారు కమలాత్మికదేవిగా దర్శనమిచ్చారు. అలాగే పారకాల్వ రాజరాజేశ్వరిదేవి మహాలక్ష్మిగా కటాక్షించారు. ఈ కార్యక్రమంలో కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానందభారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిస్వామి, బాలాజీ స్వామి, ఉభయదాత భాస్కర్‌రెడ్డి, సుగుణ దంపతులు పాల్గొన్నారు.


సైనిక్ స్కూల్ కౌన్సెలింగ్‌లో వెరిటాస్‌కు అవకాశం

రామచంద్రాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ సొసైటీ, రక్షణ మంత్రిత్వ శాఖ వారు తిరుపతిలోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌ను కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు ఎంపిక చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దీనిపై పాఠశాల చైర్మన్ డాక్టర్ బీఓషారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అఖిల భారత సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఏఐఎస్ఎస్ఈఈ-2025)రాసి గత కౌన్సెలింగ్‌లో సీట్లు దక్కని విద్యార్థులకు ఇది మంచి అవకాశం అని వివరించారు.

నంది వాహనంపై అన్నపూర్ణగా ఎల్లమ్మ దర్శనం









నంది వాహనంపై అన్నపూర్ణగా దర్శనమిస్తున్న ఎల్లమ్మ, మిట్టమీద గంగమ్మ- తొండవాడలో కూష్మాండ అలంకరణలో ఉగ్రప్రత్యంగిరాదేవి - లలితాదేవిగా దర్శనమిస్తున్న సంతోషి మాత

చంద్రగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ దేవీనవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ఎల్లమ్మ అన్నపూర్ణ అలంకరణలో నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో అన్నపూర్ణగా అలంకరించి నంది వాహనంపై అధిష్టింపజేశారు. చంద్రగిరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, ఉభయదారులు మొండికాల్వ నాగరాజనాయుడు, చంద్రగిరిలోని బురిగాల వంశస్థులు, నడింపల్లి గ్రామస్తులు, శ్రీనివాసులరెడ్డి, ఆలయ బోర్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ● మిట్టమీద గంగమ్మ గజలక్ష్మి అలంకరణలో గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ● శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం ఆవరణలోని సంతోషిమాత లలితదేవిగా దర్శన మిచ్చారు. ● తొండవాడలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని చతుర్థ దుర్గగా కుష్మాండ అలంకరణ చేసి ఆలయ ఆవరణలో కొలువుదీర్చారు. దీంతో అమ్మవారు చంద్రఘంట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పీఠాధిపతి సూరి స్వామి, భక్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా మూలస్థాన ఎల్లమ్మ, చాముండేశ్వరీదేవి అభయం





మహాలక్ష్మిదేవి అలంకారంలో మూలస్థాన యల్లమ్మ, చాముండేశ్వరీదేవి

తిరుపతిరూరల్, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట చెంచువారికాలనీలో కొలువైన మూలస్థాన ఎల్లమ్మ శుక్రవారం మహాలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, మౌనికదేవి దంపతులు, గిహినిరెడ్డి, కేతన్‌విష్ణుసాయిరెడ్డి వ్యవహరించారు. భక్తులకు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, మౌనికదేవి దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బిరుదాల సిద్ధారెడ్డి, బిరుదాల హనుమంతరెడ్డి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పి.భరత్‌కుమార్‌రెడ్డి, తులసీరామిరెడ్డి, రాధారాయల్, గురవారెడ్డి, రోహిత్ పాల్గొన్నారు.

● తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి మహాలక్ష్మిదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ఉభయదారులుగా పి.మునిరాజ, ఎం.చంద్రబాబు, బి.విజయరాఘవ రెడ్డి, బి.మునిక్రిష్ణారెడ్డి, ఎస్.శంకర్‌నాయుడు, బి.వెంకటేశ్వర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఎస్.ము రగయ్య, ఎం.పుష్పావతి, పి.శ్రీహరిరెడ్డి, ఎస్కే పాపమ్మ, కె.అప్పిరెడ్డి, పి.రవీంద్రారెడ్డి, టి.చంద్ర బాబు, పి.మాధవి వ్యవహరించారు. అమ్మవారిని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి దంపతులు, ఏపీజీబీసీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌకర్యాలపై చైర్మన్, ఈవో ఆరా



తిరుమల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అందుతున్న సౌకర్యాలపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం రాత్రి ఆరా తీశారు. ముత్యపుపందిరి వాహనసేవలో వీరు గ్యాలరీల్లోని భక్తుల వద్దకు వెళ్లి మాట్లాడారు. భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి మరింత మెరుగైన సౌకర్యాలు అందిస్తామన్నారు. కొన్ని కళాబృందాలతో ఈవో ఉత్సాహంగా గడిపారు.

బోర్డు సభ్యుడికి చేదు అనుభవం

శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వచ్చిన టీటీడీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి వాహన మండపానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కుంభహారతి పాయింట్‌కు సమీపంలోని గేటు సిబ్బంది ఆయన్ను అడ్డుకున్నారు. బోర్డు సభ్యుడని పలువురు చెప్పినా గేటు తెరిచేందుకు సిబ్బంది నిరాకరించారు. కొంతసమయానికి అధికారులు జోక్యం చేసుకుని బోర్డు సభ్యుడిని వాహన మండపానికి పంపారు. కొన్ని ప్రధాన గేట్ల వద్ద ఎలాంటి అవగాహన లేని వారిని నియమించిన క్రమంలో ఎవరు ఉన్నతాధికారులు, ఎవరు బోర్డు సభ్యులు అనేది తెలుసుకోలేక అక్కడక్కడ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

గరుడ సేవలో అప్రమత్తంగా ఉండాలి

ఆదివారం జరిగే గరుడ సేవలో అప్రమత్తంగా ఉండాలని డిప్యుటేషన్ సిబ్బందిని జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. తిరుమలలోని బ్రహ్మోత్సవం సెల్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన గ్యాలరీల పర్యవేక్షణ కోసం నియమించిన డిప్యూటేషన్ అధికారులతో సమీక్షించారు.

గరుడ సేవకు ఇలా వెళ్లండి

● పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ ఆంక్షలను ప్రకటించిన పోలీసుశాఖ

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గరుడ వాహన సేవకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అందువల్ల తిరుపతి నగరంలో ట్రాఫిక్ డైవర్షన్లు అమల్లోకి తెస్తున్నట్లు పోలీసు శాఖ ప్రకటించింది. తిరుపతి నుంచి తిరుమలకు ఆర్టీసీ వాహనాలనే వినియోగించాలని కోరింది. కొండపై పార్కింగ్ సమస్య రాకుండా ప్రైవేటు వాహనాలను తిరుపతిలోనే పార్క్ చేయాలని సూచించింది. పార్కింగ్ ప్రదేశాల కోసం క్యూఆర్ కోడ్ ఉపయోగించుకోవాలని కోరింది. పార్కింగ్ ప్రదేశాలలో టీటీడీ వారు తాగునీరు, అన్నప్రసాదాలు, టాయిలెట్స్ సదుపాయం.. తిరుమలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులనూ ఉంచనున్నారు.

తిరుపతిలో పార్కింగ్ ప్రదేశాలు

● కడప, శ్రీకాళహస్తి వైపు నుంచి వచ్చే వాహనాలకు ఇస్కాన్ గ్రౌండ్, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్, భారతీయ విద్యాభవన్ గ్రౌండ్‌లలో రెండు.. నాలుగు చక్రాల వాహనాలు నిలపాలి.

● చిత్తూరు, పీలేరు, ఇతర జిల్లాల నుంచి వచ్చే టూరిస్టు.. టెంపో ట్రావెల్స్ వాహనాలకు దేవలోక్ ప్రాంగణంలో పార్కింగ్ సౌకర్యం.

● మదనపల్లె, చిత్తూరు నుంచి వచ్చే నాలుగు చక్రాల వాహనాలకు భారతీయ విద్యాభవన్, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్, ఇస్కాన్ టెంపుల్ గ్రౌండ్.

● కరకంబాడి వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజ్ వద్ద కట్-ఆఫ్ పార్కింగ్ ఏర్పాటు చేశారు.

● పుత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు మ్యాంగో మార్కెట్‌లో పార్కింగ్.

● మదనపల్లె, చిత్తూరు వైపు నుండి వచ్చే వాహనాలకు వకులమాత ఆలయం, చెర్లోపల్లి వద్ద కూడా పార్కింగ్ సదుపాయం ఉంది.

తిరుపతిలోకి రావాలంటే..

చిత్తూరు, మదనపల్లె వైపు నుంచి తిరుపతి లోపలకు వచ్చే ఆర్టీసీ బస్సులు కాలూరు క్రాస్, ఆర్సీ పురం జంక్షన్ మీదుగా తనపల్లె గరుడ ఫ్లై ఓవర్ గుండా బస్టాండుకు వెళ్లాలి.

● తిరుమలకు ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణించే యాత్రికులు, నంది.. గరుడ సర్కిల్ మార్గం గుండా యథాప్రకారం తిరుమల వెళ్తారు.

ద్విచక్ర వాహనాలకు ప్రవేశం లేదు

శనివారం రాత్రి 9 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు అలిపిరి ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు. గరుడ సేవకు టూ వీలర్లలో వచ్చే యాత్రికులకు అలిపిరి బాలాజీ లింక్ బస్టాండ్ వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించారు.

కట్టుదిట్టమైన భద్రతలో గరుడసేవ

ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ఆదివారం జరిగే గరుడవాహనసేవను మరింత కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహించబోతున్నామని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుమలలో శుక్రవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ, భారీగా భక్తులు తరలివస్తారనే అంచనాతో విజిలెన్స్ విభాగంతో సమన్వయం చేసుకుని పటిష్టబందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. 3 వేల మంది సిబ్బంది తిరుమలలో, 800 మంది పోలీసు సిబ్బంది తిరుపతిలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారని, గరుడవాహనసేవ రోజు తిరుమలలో వెయ్యి మంది, తిరుపతిలో 200 మంది అదనంగా బందోబస్తులో ఉంటారన్నారు. ట్రాఫిక్ అంక్షలు శనివారం సాయంత్రం నుంచి అమలుచేస్తామన్నారు. తిరుమలలో 4 వేల వాహనాలకు మాత్రమే పార్కింగ్ ప్రదేశాలు ఉన్నాయని, ఆపై వచ్చే వాహనాలను తిరుపతిలో ఏర్పాటు చేసిన ఐదు పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తామన్నారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద ఆర్టీసీ బస్సులను కూడా ఉంచుతామన్నారు. ఆయా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడుల ద్వారా సులభంగా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించవచ్చన్నారు. ఎప్పటిలానే గరుడవాహనసేవ ముందు రోజు సాయంత్రం నుంచి తర్వాతి రోజు ఉదయం వరకు ద్విచక్రవాహనాలను ఘాట్‌రోడ్లలో అనుమతించమని స్పష్టం చేశారు.





తిరుమల బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ముత్యపుపందిరి వాహనసేవ కన్నుల పండువగా సాగింది. ఆ వాహనసేవ ముందు ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శనలు









ఆకట్టుకున్న భక్తిసంగీత కార్యక్రమాలు

తిరుమల, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఆస్థానమండపం, నాదనీరాజనం వేదికలపై శుక్రవారం భక్తిసంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాదనీరాజనం వేదికపై ఉదయం మంగళధ్వని, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో వేదపారాయణం, బెంగుళూరుకు చెందిన స్ఫూర్తిరావు బృందం గాత్ర కచేరి నిర్వహించారు. ఇక, ఆస్థానమండపంలో హైదరాబాద్‌కు చెందిన పార్థసారధి బృందం విష్ణుసహస్రనామ పారాయణం, రాయచూరుకు చెందిన వెంకటేశన వలి బృందం భక్తిసంగీతం, భద్రాచలానికి చెందిన మురళిబృందం ధార్మిక ఉపన్యాసం భక్తులు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన ఆనందభట్టర్ బృందం అన్నమయ్య సంకీర్తనలు మధురంగా ఆలపించారు. ఇక, రాత్రి తిరుపతికి చెందిన శారదాబృంద హరికథ కలక్షేపం నిర్వహించారు.

నిరంతరం వైద్య సేవలు

● టీటీడీ సీఎంవో డాక్టర్ నర్మద

తిరుమల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు నిరంతరం వైద్యసేవలు అందిస్తున్నామని టీటీడీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మద తెలిపారు. మీడియా సెంటర్‌లో అశ్విని ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమ కుమారితో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 50 మంది డాక్టర్లు, 60 మంది పారా మెడికల్ సిబ్బంది సేవలందిస్తున్నామన్నారు. సాధారణ రోజుల్లో అందుబాటులో ఉండే 10 అంబులెన్స్‌లకు అదనంగా మరో 4 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచామన్నారు.. గరుడసేవ రోజున 20 మంది సీనియర్ డాక్టర్లు, 20 మంది పారామెడికల్ సిబ్బంది ఈకార్నర్ పాయింట్లలో ఉంటారన్నారు. సీనియర్ సిటిజన్ షెడ్డు వద్ద 12 పడకల ఐసీయూ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



మహాలక్ష్మీదేవిగా సర్వమంగళాదేవి

రూ.10 లక్షలతో అమ్మవారికి అలంకరణ



సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సర్వమంగళా దేవి ఐదో రోజైన శుక్రవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ.10 లక్షల నగదుతో విశేషంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త ఇందూరి రవికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆగని ఆర్టీసీ బస్సులు... ఇబ్బందుల్లో ప్రయాణికులు

ఏర్పేడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సులు ఆగడం లేదు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఏర్పేడు మండల కేంద్రంలో కేంద్రీయ విద్యా సంస్థలు ఐఐటీ, ఐసర్లతో పాటు ప్రముఖ కంపెనీలు, గుడిమల్లం పరశురామేశ్వరాలయం ఉంది. అంతేకాకుండా మండల కేంద్రంలో సద్గురు మలయాళస్వామి స్థాపించిన వ్యాసాశ్రమం ఉంది. ఈ ప్రముఖ ప్రదేశాలకు నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఏర్పేడులో ఆర్టీసీ బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి ఆరులేన్ల రోడ్డు ఏర్పాటుతో ఆర్టీసీ బస్సులు తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి, శ్రీకాళహస్తినుంచి తిరుపతికి నేరుగా వెళ్లిపోతున్నాయి. ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి ఏర్పేడులో ఆర్టీసీ బస్సులు నిలిపే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

బీఎన్ కండ్రిగ మార్కెట్ కమిటీ నియామకంపై స్టే

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ నియామకంపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. బుచ్చినాయుడు మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు సతీమణి జ్యోతిని నియమిస్తూ ఈనెల 4న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ పదవికి సంబంధించి రిజర్వేషన్ నిబంధనలు సక్రమంగా పాటించలేదంటూ కేవీబీపురం మండల కోవనూరుకు చెందిన వై.సురేంద్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది టీడీ ఫణికుమార్ వాదనలు వినిపించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులపై స్టే విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ భానుమతి ఆదేశించారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ రెడ్డి

సత్యవేడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శంకర్‌రెడ్డి హాజరయ్యారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు చేసినట్లు తెలిపారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ పి.మోహన్, డైరెక్టర్ చక్రపాణి రెడ్డితో ప్రమాణం స్వీకారం చేయించారు. మరో డైరెక్టర్ సుబ్రమణ్యం రాజు అనారోగ్యం కారణంగా ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేదు. కార్యక్రమంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చందన స్రవంతి, నాయకులు మస్తాన్, సుందరరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పరమశివం తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులుకు ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం



శ్రీనివాసులు దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

రేణిగుంట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులుకు వ్యవసాయ విస్తరణలో ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం లభించింది. గుంటూరు కేఎల్ యూనివర్శిటీలో ఏరువాక ఫౌండేషన్, ఏరువాక తెలుగు మాసపత్రిక సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన కిసాన్ మహోత్సవ్‌లో ఈ పురస్కారం ప్రదానం చేశారు. డ్రం సీడర్, యంత్ర సాంకేతికత, నూనెగింజలు, అపరాలల్లో అధిక దిగుబడినిచ్చే రకాలు, భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం తదితరాలను రైతులకు చేరవేసి వారి అభివృద్ధికి దోహదపడిందుకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఏరువాక మాసపత్రిక ఎడిటర్ రాఘవరావు, ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి యాత్రికులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి గొడుగులతో పాదయాత్రగా తిరుమల వెళుతున్న భక్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ఏటా చెన్నైలోని తిరునిండ్రయూర్‌కు చెందిన శ్రీమద్ రామానుజాచార్య నిత్య కైంకర్యం ట్రస్టు ఆధ్వర్యంలో తిరుమలలో బ్రహ్మోత్సవాల్లో జరిగే గరుడోత్సవానికి గొడుగులను సమర్పించడం ఆనవాయితీ అన్నారు. ఈక్రమంలో పిచ్చాటూరుకు చేరిన గొడుగులకు ఆహ్వానం పలికి స్థానిక ఎంకేటీ కల్యాణ మండపంలో భక్తులకు అన్నదానం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పద్దురాజు, రవి రెడ్డి, వాసురెడ్డి, దొరవేలు రెడ్డి, మురళి, రవి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరిస్తాం



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో

కేవీబీపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భూ సమస్యను పరిష్కరిస్తామని ఆర్డీవో చెప్పారు. మండలంలోని పెరిందేశం గ్రామానికి చెందిన బత్తెయ్యకు తిమ్మసముద్రంలో ఉన్న భూమి ఆక్రమణకు గురైంది. దీనిపై బత్తెయ్య కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారుకు వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి శుక్రవారం తిమ్మసముద్రంలోని బత్తెయ్యకు చెందిన భూమిని పరిశీలించారు. అక్కడి నుంచి సూరమాలకు చెందిన బండిబాబు భూమి నుంచి సర్వే చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దారు రోశయ్య, ఆర్ఐ కరుణాకర్ రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐటీలో మౌలిక వసతుల ప్రాజెక్టుకు నేడు శంకుస్థాపన

వర్చువల్‌గా ఢిల్లీ నుంచి ప్రారంభించనున్న ప్రధాని మోదీ

ప్రధాన అతిథిగా తిరుపతి ఎంపీ గురుమూర్తి ● గౌరవ అతిథిగా కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలో తిరుపతి ఐఐటీలో ఫేజ్- బి లో భాగంగా మౌలిక వసతుల ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈనెల 27న శనివారం ఉదయం శంకుస్థాపన చేయనున్నారు. ఢిల్లీ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ కే.ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఐఐటీ క్యాంపస్‌లో ఎల్‌హెచ్‌సీ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి ఎంపీ గురుమూర్తి, గౌరవ అతిథిగా కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరవుతారు. శనివారం ఉదయం 11.05 గంటలకు సరస్వతి వందనం, దీప ప్రజ్వలనతో ప్రారంభిస్తారు. ఆ తరువాత ప్రాజెక్టు పరిచయం, ఇప్పటి వరకు ఐఐటీ సాధించిన విజయాలపై డైరెక్టర్ సత్యనారాయణ ప్రసంగిస్తారు. 11.30లకు ప్రధాన మంత్రి మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే ఆదిమూలానికి ఆహ్వానం

పిచ్చాటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయ నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే ఆదిమూలంకు ఆలయ ఈవో లత, ప్రధాన అర్చకులు కార్తికేయ గురుకుల్ ఆహ్వాన పత్రిక అందించారు. ఈ క్రమంలో పిచ్చాటూరుకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందించినట్లు తెలిపారు.

కటాక్షించు మాతా



గాయత్రీదేవి అలంకారంలో బజారువీధి కన్యకాపరమేశ్వరి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కటాక్షించవమ్మ మాతా అంటూ భక్తులు అమ్మవార్లను వేడుకున్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం వివిధరూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞాన ప్రసూనాంబిక ఉత్సవమూర్తిని అశ్వాసురవధగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారిని ఆలయంలో రంగులగోపురం వరకు ఊరేగించారు. అలాగే ఆలయంలోని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో అమ్మవారు స్కందమాతగా కొలువుదీరారు. ఇదే ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మను దక్షిణకాళికాదేవి, పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారు, బహదూరుపేటలోని కరుమారియమ్మ, బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ, పొన్నాలమ్మ, భాస్కరపేట చాముండేశ్వరి, తెట్టు నల్లగంగమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులపై వరాల జల్లు కురిపించారు. బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి శ్రీరంగం శ్రీరంగనాయకదేవిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి గాయత్రిదేవిగా, విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడివీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, బీపీ అగ్రహారం గంగమ్మ, పూసలవీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, వీవీరోడ్డులోని అంకమ్మ, బంగారమ్మ, పానగల్ గంగమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు.

అన్నపూర్ణ దేవి అలంకరణలో అవనాక్షమ్మ

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయంలో కొలువై ఉన్న అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారిని కామాక్షిదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కైలాసనాథ కోనలోని కామాక్షి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

మహాలక్ష్మిగా ఆనందవల్లి

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిందేపల్లిలో కొలువై ఉన్న పార్వతీ సమేత సిద్దేశ్వరస్వామి ఆలయ దసరా ఉత్సవాల్లో పార్వతీదేవి శ్రీమహాలక్ష్మిగా భక్తులకు అభయం ఇచ్చారు. గుడిమల్లం ఆలయ దసరా ఉత్సవాల్లో భాగంగా ఆనందవల్లి అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మిగా అవతరించి భక్తులకు దర్శనమిచ్చారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా అంబూరులోని కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు.



మహాలక్ష్మి అలంకారంలో చిందేపల్లి పార్వతీదేవి, గుడిమల్లం ఆనందవల్లి, వరదయ్యపాళెం చెంగాళమ్మ, బహదూరుపేట కరుమారియమ్మ, దక్షిణ కాళికాదేవి, చిట్టత్తూరు పోలేరమ్మ, భాస్కరపేట చాముండేశ్వరి, నల్లగంగమ్మ, పొన్నాలమ్మ, బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ



స్కందమాతగా బొమ్మలకొలువులోని జ్ఞానప్రసూనాంబ, అశ్వాసుర వధ అలంకారంలో జ్ఞానప్రసూనాంబ, శ్రీరంగం శ్రీరంగనాయకిదేవి అలంకారంలో బహదూరుపేట కన్యకాపరమేశ్వరి, కామాక్షి దేవి అలంకరణలో అవనాక్షమ్మ, గాయత్రి దేవి అలంకరణలో కామాక్షిదేవి, మహాలక్ష్మిగా ముత్యాలమ్మ

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



ఆలత్తూరులో గ్రామసభ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు ఎంపీడీవోకు మొరపెట్టుకున్నారు. శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో స్థానికులు మాట్లాడుతూ... క్వారీల కారణంగా శ్రీకాళహస్తి - తడ రోడ్డు నుంచి గ్రామానికి వచ్చే రహదారి గుంతలమయమై అధ్వానంగా మారిందన్నారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జి ఎంపీడీవో రోడ్డు సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. క్వారీలపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



కేవీబీపురం,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరు గిరిజనకాలనీలో ఈనెల 25న గురువారం రాత్రి బోనుపల్లికి చెందిన కొంతమంది ప్రవేశించి కర్రలు, కత్తులతో స్వైరవిహారం చేసి అడ్డువచ్చిన వారిని గాయపరిచారు. బాధితులు శుక్రవారం పోలీస్‌స్టేషన్ వద్ద తమపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. సీపీఎం నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి జనార్దన్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

సత్యవేడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎంపురంలో శుక్రవారం దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి క్రిస్టల్‌దాస్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. నోరు, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. సర్పంచ్ శిరీషారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో సుబ్రమణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, మునస్వామి యాదవ్, ఢిల్లీబాబు, సాయికుమార్, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఐఐటీలో మానసిక ఆరోగ్య వారోత్సవం



ఏర్పేడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలంటే ఒత్తిడికి లోను కాకూడదని ఐఐటీ అధికారులు పేర్కొన్నారు. ఏర్పేడు సమీపంలో ఉన్న తిరుపతి ఐఐటీలో గురువారం రాత్రి మానసిక ఆరోగ్య వారోత్సవాన్ని ఐఐటీ అధికారులు నిర్వహించారు. మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్



రేణిగుంట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీపాళ్యెం పంచాయతీ పరిధిలోని కుక్రకాలువలోకి పాపానాయుడు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. ఈ దాడుల్లో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, వీఆర్వో నళిని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై విస్తృత ప్రచారం

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్‌గా ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గుదల చేసిందని, శనివారం నుంచి 15 రోజులపాటు 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ అన్నారు. శుక్రవారం తిరుపతిలోని ఆమె నివాసంలో పార్టీ నాయకులతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ విధానాలతో ప్రతి కుటుంబానికీ రూ.15వేల వరకు ఆదా అవుతుందన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, రాష్ట్ర నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, మన్నెం శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, శ్రీహరినాయుడు, వేణుగోపాల్ నాయుడు, ఊట్ల సురేంద్ర నాయుడు, అరగొండ చంద్ర, ఆనంద్‌బాబు యాదవ్, విశ్వనాథం, ఆముదాల తులసీరాం, పుష్పావతి, బ్యాంకు శాంతమ్మ, హేమావతి, అనిత, రేవతి, సుజాతమ్మ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎన్‌కండ్రిగ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి చెప్పారు. నాలుగు సంవత్సరాల క్రితం బీఎన్‌కండ్రిగలో ఆధార్ కేంద్రం మూతపడింది. ప్రజలు ఆధార్ కోసం కాటూరు, వెస్ట్‌వరత్తూరు, శ్రీకాళహస్తి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆధార్ ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు ఆందోళన చేశారు. ఎట్టకేలకు బీఎన్‌కండ్రిగ సచివాలయంలో ఆధార్ కేంద్రం తిరిగి అందుబాటులోకి రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

పాండూరు సచివాలయంలో...

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజనుల కోసం పాండూరు సచివాలయంలో శుక్రవారం ప్రత్యేక ఆధార్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా తొండంబట్టు, పాండూరు పంచాయతీలకు చెందిన 57 మంది గిరిజనులకు నూతన ఆధార్ కార్డులు నమోదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి గురవయ్య తెలిపారు. సర్పంచ్ కవిత, రెవెన్యూ కార్యదర్శి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు రన్ శ్రీకాళహస్తి రన్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28న పట్టణంలో రన్ శ్రీకాళహస్తి రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గడ్డూరు మయూర్ తెలిపారు. ఉదయం 8గంటలకు ఎంజీఎం ఆస్పత్రి నుంచి మారథాన్ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనడానికి నెం. 7288877300, 7288877308లలో సంప్రదించాలన్నారు.

ఎల్లుండి లోక్ కల్యాణ్ మేళా

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్తలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో 29న సోమవారం ఉదయం 11గంటలకు పురపాలకసంఘ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని కమిషనర్ భవానీ ప్రసాద్ తెలిపారు. వీధి విక్రయదారులు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్‌క్యాంపు జరుగుతుంది, బ్యాంకు మేనేజర్లు, కార్మిక, పౌరసరఫరాలు, ఆరోగ్య, ఫుడ్ సేఫ్టీ, ఐసీడీఎస్ శాఖల ప్రతినిధులు, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు హాజరుకానున్నారు.

పుత్తూరు వార్తలు

గజలక్ష్మి అలంకరణలో ద్రౌపదిదేవి



గజలక్ష్మిగా ద్రౌపది - కరుమారియమ్మగా కామాక్షమ్మ - లలితా త్రిపుర సుందరిగా నాగాలమ్మ

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ద్రౌపదిదేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే సదాశివేశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మ... కరుమారియమ్మగా భక్తులను కటాక్షించారు. రైల్వే క్వార్టర్స్‌లో కొలువై ఉన్న నాగాలమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా భక్తులను కటాక్షించారు. రాచపాలెంలో ఉన్న లక్ష్మీ కనకదుర్గమ్మ... మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.



వడమాలపేట (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి శుక్రవారం ధనలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామాచార్చన, కుంకుమ పూజ చేశారు. రాత్రి అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించి పూజించారు. అర్చకుడు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో తీర్థప్రసాద వినియోగం జరిగింది. అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేశారు.

లోక్ కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఎర్రాయం

పుత్తూరు అర్బన్, సెప్టెం బర్ 26(ఆంధ్రజ్యోతి): లోక్ కల్యాణ్ మేళాను వీధి వ్యాపా రులు సద్వినియోగం చేసుకో వాలని మెప్మా పీడీ ఎర్రాయం చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పుత్తూరు పురపాలక సంఘం పరిధిలోని వీధి వ్యాపారులు శుక్రవారం పుత్తూరు పురపాలక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పీఎం స్వనిధి 2.0 లో భాగంగా మొదటి విడత రూ.15 వేలు, రెండో విడత రూ.25 వేలను విడుదల చేస్తున్నారని తెలిపారు. పుత్తూరులో మొత్తం 1,474 వీధి వ్యాపారులకు రుణాలు మంజూరుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

గోవింద భక్తులకు అన్నదానం



వడమాలపేట,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తమిళనాడు నుంచి తిరుమలకు పాదయాత్రగా నడిచివెళ్లే భక్తులకు తడుకు ఆర్ఎస్ వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. బాలాజీ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం వడ్డించారు. తిరుపతి గంటా న్యూరో హాస్పిటల్ ఆధ్వర్యంలో న్యూరాలజిస్ట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు. 19 సంవత్సరాలుగా శ్రీవారి బ్రహ్మోత్సవ రోజుల్లో గోవింద భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ట్రస్టు సభ్యులు శ్రీధర్ రాజు, రాజేంద్ర రాజు, దామోదర్ రెడ్డి, రామచంద్ర రాజు ఏర్పాట్లను పర్య వేక్షించగా నాయకులు అమ్ములు, నారాయణబాబు, భాస్కర్ రెడ్డి, రామారావు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో అక్టోబరు 3వ తేదీ నుంచి 31 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య కలిగిన నిరుద్యోగ మహిళలు ఈశిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణకు దరఖాస్తు చేసుకొనేవారు కనీసం పదోతరగతి చదివి ఉండాలని తెలియజేశారు. వివరాలకు 7989680587, 9494951289, 6301717672 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

సింహ వాహనంపై యోగనరసింహుడి విహారం



యోగనరసింహుడి అవతారంలో సింహవాహనంపై ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరుడు

తిరుపతిరూరల్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామివారు యోగ నరసింహుడి అవతారంలో సింహ వాహనంపై విహరించి భక్తులకు అభయమిచ్చారు. వాహనం ముందు వృషభాలు నడుస్తుండగా..భక్తజనబృందాల భజనలు, కోలాటాలు, మంగళ వాయిద్యాలతో కోలాహలంగా సాగింది. రాత్రి ముత్యపు పందిరిలో కొలువుదీరి భక్తులను కటాక్షించారు. పలుగ్రామాలకు చెందిన భక్తులు స్వామివారికి సారె సమర్పించి మొక్కు చెల్లించారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

పాకాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాకాల రైల్వే స్టేషన్ ఉప్పరపల్లె సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం రాత్రి గుర్తించారు. జీఆర్పీ ఎస్ఐ రత్నమాల కథనం మేరకు.. మృతుడి వయస్సు సుమారు 25-30 సంవత్సరాల లోపు ఉంటుంది. తెల్లని షర్టు మీద నలుపురంగు గీతలున్నాయి. బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. రైలు ఢీకొని మృతిచెందినట్లు తెలుస్తోంది.

ఎస్వీయూ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ స్టోర్స్ కమిటీ చైర్మన్‌గా శివప్రసాద్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ స్టోర్స్ కమిటీ చైర్మన్‌గా కె.శివప్రసాద్ నియమితులయ్యారు. ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా కె.శివప్రసాద్, సభ్యులుగా కె.నాగరాజు, టి.విజయ సారథిని నియమించారు. త్వరలో ఈ కమిటీ బాధ్యతలు స్వీకరించనుంది.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మద్యం మత్తులో నదిలో దూకిన యువకుడు

వాకాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వాకాడుకు చెందిన పనబాక ప్రసన్న శుక్రవారం మద్యం మత్తులో స్వర్ణముఖి బ్యారేజీ గేట్ల రోపులను పట్టుకొని నదిలోకి దూకడంతో అగ్నిమాపకశాఖ సిబ్బంది, పోలీసులు అప్ర మత్తమై రక్షించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ప్రసన్న 30 అడుగుల లోతు ఉన్న స్వర్ణముఖి బ్యారేజీ గేట్ల రోపులను పట్టుకొని దిగుతూ నదిలోకి దూకివేయడంతో స్థానికులు గమనించిన అగ్నిమాపకశాఖ, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది నాగరాజు చాకచక్యంగా ప్రసన్నను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. గతంలోనూ ప్రసన్న మద్యం తాగి బస్టాండ్ సమీపంలో ఉన్న 125 అడుగుల బీఎస్ఎన్ఎల్ టవర్ పైభాగం వరకు ఎక్కి కూర్చోవడంతో పోలీసులు కిందకు దించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల మెరుగైన సేవలు అందించడమే ధ్యేయమని స్టేట్‌బ్యాంకు ఏజీఎం సత్యనారాయణ స్వామి అన్నారు. ఎస్బీఐ స్థాపించి 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సూళ్లూరుపేట ఎస్బీఐలో సమావేశం నిర్వహించారు. ఖాతాదారుల చేతుల మీదుగా కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్బీఐ మేనేజర్ గిరిధర్ రెడ్డి, ఎఫ్‌వో నందకిషోర్, కృష్ణ, సాయిబాబు, కాళంగి ప్రభాకర్, వాకచర్ల రమేష్, ఓలేటి బాల సత్యనారాయణ, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29న పీఏసీఎస్ పాలకవర్గ సమావేశం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఈనెల 29వ తేదీన పాలకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ అల్లూరు కరుణాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సమావేశానికి అధికారులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

మూడు లారీల ఢీ

తడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మూడు లారీలు ఒకదాన్కొటి ఢీకొన్న ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఓ కంటైనర్ లారీ తడ బస్టాండ్ కూడలి వద్ద ఫ్లైఓవర్ సమీపంలో రోడు పక్కన ఆగింది. అదే దారిలో కుడివైపున మరో కంటైనర్ లారీ వెళ్తుండగా మరో కంటైనర్ లారీ రెండు లారీల మధ్యలో వెళ్లేందుకు ప్రయత్నించి ఇరుక్కుపోయింది. ఈప్రమాదంలో రెండు లారీలు కొంత మేర దెబ్బతిన్నాయి. రోడ్డుపై ట్రాఫిక్ అరగంటపాటు నిలబడిపోయింది.

ఏబీవీపీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

టిప్పరు ఢీకొని ఐదు గొర్రెల మృతి

చిల్లకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం సమీపంలో శుక్రవారం టిప్పరు ఢీకొని ఐదు గొర్రెలు మృతి చెందాయి. యశోదమ్మకు చెందిన గొర్రెలు గ్రామ సమీపంలోని పొలాల్లోకి మేతకు వెళ్లాయి. రోడ్డు పక్కన మేస్తుండగా టిప్పరు అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదు గొర్రెలు మృతిచెందగా పది గొర్రెలకు గాయాలయ్యాయి.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కనస్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా కార్మికుల సమస్యలపై సమీక్ష నిర్వహించకుండా కార్పొరేట్ యాజమాన్యాలకు ప్రయోజనం చేకూరేలా వ్యవహరించడం మంచిపద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో డీపీ పోలయ్య, మీరావలి, ఆసీయా, మమత, రమేష్, చెంగల్‌రావు, నవకోటి, అనిల్, రత్నం, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బాలాజి మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపరాదన్నారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిగా చిన్నరెడ్డెయ్య

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిగా ఎన్.చిన్నరెడ్డెయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు గుర్రం జాషువా జయంతి ఉత్సవం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కవి కోకిల గుర్రం జాషువా జయంతి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ప్రముఖ కవులు, రచయితలు హాజరుకానున్నారని వెల్లడించారు.

5న భక్త కనకదాసు విగ్రహావిష్కరణ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ బస్టాండు ముందున్న కూడలిలో అక్టోబర్ 5వ తేదీన భక్త కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరించ నున్నట్లు కమిటీ ప్రతినిధులు మంగిరి రెడ్డెప్ప, కేవీ రమణ తెలిపారు. వారు శుక్రవారం విగ్రహాన్ని, సభా స్థలిని పరిశీలించారు. ముఖ్య అతిథిగా మంత్రి సవితమ్మ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ముందుగా బాలాజీకాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ కో కన్వీనర్లు ఆవుల రవీంద్ర, ఆర్.మల్లి, పీవీ శంకరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి ప్లంబర్ మృతి

చంద్రగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పరిధిలోని తిరుపతి- పీలేరు జాతీయ రహదారిలో ఉన్న ఓప్రవేటు కళాశాల భవనంపై నుంచి కింద పడి ఓ ప్లంబర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ముంగిలిపట్టు హరిజనవాడకు చెందిన రాజేంద్రప్రసాద్ ఓప్రైవేటు కళాశాలలో ప్లంబర్ పనులు చేస్తున్నాడు. రెండవ అంతస్తులో పైప్‌లైన్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కళాశాల సిబ్బంది రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు

ఒకరికి తీవ్రగాయాలు

చంద్రగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిలోని కాశిపెంట్ల వద్ద కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాల య్యాయి. పోలీసుల కథనం మేరకు..తిరుపతికి చెందిన వాసు తన కారులో చిత్తూరుకు బయలుదేరాడు. కాశిపెంట్ల వద్ద కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. వాసుకి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గూడూరు: మహాలక్ష్మిగా విజయదుర్గాదేవి, రక్తభీజవధ అలంకారంలో ద్రౌపదీదేవి, దుర్గాదేవి అలంకారంలో బజారుకలిశం అమ్మవారు - సూళ్లూరుపేట: ప్రత్యేక అలంకరణలో మన్నారుపోలూరు చెంగాళమ్మ, బాలత్రిపుర సుందరిగా పార్వతీదేవి

మహాలక్ష్మిగా చెంగాళమ్మ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చెంగాళమ్మ పరమేశ్వరి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకానంతరం పుష్పాలంకరణ చేశారు. బాపూజీ వీధి, గాండ్ల, పార్కు, కచ్చేరివీధికి చెందిన భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అలంకారానికి ఓడూరు ముని కృష్ణారెడ్డి, పావని, చండీయాగానికి యర్రం హనుమా రెడ్డి, హిమబిందు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. వేనాటి సురేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికా దేవి, పోలేరమ్మ, దుర్గాదేవి, కన్యకాపరమేశ్వరి, అంకమ్మ ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మూకాంబికాదేవి మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవిని శ్రీమహాలక్ష్మి అలంకారంలో, బజారుకలశం వద్ద అమ్మవారిని దుర్గాదేవిగా, రాజరాజేశ్వరీదేవిని శ్రీమహాలక్ష్మీ దేవిగా, కన్యకాపర మేశ్వరిని విజయలక్ష్మిగా, ధర్మరాజ స్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని రక్తభీజవధ అలంకా రంలో, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను కాత్యాయినిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని అర్ధరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని గజలక్ష్మీదేవిగా అలంకరించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరికి మోహిని అలం కారం, మూల విరాట్‌కు నెమలి ఈక, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో కాత్య యనీదేవిని సంతానలక్ష్మిగా, వెంకటేశ్వర స్వామికి వామన అవతారం, మంద నాంచరేశ్వరిని మధుర మీనాక్షీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

డక్కిలి: దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో పార్వతీదేవిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.

కోట: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిని మహాలక్ష్మి అలంకారంలో, కోటమ్మ ఆలయ ప్రాంగణంలోని దుర్గా దేవిని మహాలక్ష్మిగా, గూడలిలోని రామ లింగచాముండేశ్వరిని మహాలక్ష్మిగా అలంకరించారు.



నాయుడుపేట: మహాలక్ష్మిగా మూకాంబికాదేవి - వెంకటగిరి: మోహిని అలంకారంలో కన్యకాపరమేశ్వరి, మధుర మీనాక్షిదేవిగా మందనాంచరేశ్వరి - కోట: మహాలక్ష్మి అలంకారంలో దుర్గాదేవి, గూడలిలోని చాముండేశ్వరి

మహిళలపై ఆగడాలను అరికట్టండి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, దాడులు, వేధింపులు, హత్యలను అరికట్టాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఐద్వా నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు 12 గంటల పని విధానం అమలు చేసేలా అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని తప్పుబట్టారు. 8గంటల పని విధానం కోసం మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఆడపిల్లల నిష్పత్తిని పెంచడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకురాళ్లు జయంతి, సుజాతమ్మ, గురవమ్మ, లత, బుజ్జమ్మ, డి.హేమలత, చెంచులక్ష్మి, ఎస్.షకీల, రమాదేవి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్

వారం పాటు శేషాచలంలో యాత్ర



ట్రెక్కింగ్‌కు పయనమైన ఎన్‌సీసీ క్యాడెట్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్లు టెక్కింగ్ చేపట్టారు. శుక్రవారం తిరుపతి ఎన్‌సీసీ నగర్ నుంచి బయలుదేరారు. శేషాచలం అడవుల్లో అక్టోబరు 2వ తేదీ దాకా ఈ ట్రెక్కింగ్ సాగనుంది. దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు పాల్గొన్నారు. ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా టెక్కింగ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణం, సంస్కృతి పట్ల అవగాహనకు ఈ టెక్కింగ్ నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రాజెక్టులపై సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై సంబరాలు, సీజనల్ కండిషన్స్, పీఎం కుసుమ్, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు, సోలార్, విండ్ ప్రాజెక్టులకు సంబంధించి సమీక్షించారు. జేసీ శుభం బన్సల్, జీఎస్టీ రీజనల్ కమిషనర్ నాగేంద్ర, అడిషనల్ కమిషనర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు.

చేనేత, హస్తకళ మేళా ప్రారంభం



కలంకారి చీరలతో చేనేత మహిళ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉపాధ్యాయనగర్‌లోని ఎలైట్ సోషియల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్లో సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేత, హస్తకళ మేళాను శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. 15రోజుల పాటు జరిగే ఈ మినీ మేళాలో వివిధ రాష్ట్రాల నుంచి 35మంది కళాకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. జైపూర్ బెడ్‌షీట్స్, ఉత్తరప్రదేశ్ గృహాలంకరణ వస్తువులు, కలంకారి చీరలు, మీరట్, షోలాపూర్ చెప్పులు, ఆంధ్రా కొండపల్లి బొమ్మలు, చేనేత టవల్స్, కాటన్‌చొక్కాలు, ఖాదీటాప్, హైదరాబాదు ప్రింటెడ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్‌తో స్టాల్స్ ఏర్పాటు చేశారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి, నిర్వాహకుడు పైడి మహేష్ కోరారు.

వ్యవసాయ కాలేజీ డీన్‌గా రెడ్డి శేఖర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కాలేజీ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ రెడ్డి శేఖర్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలువురు అభినందించారు.

వేనాటి సతీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



వేనాటి సతీష్‌రెడ్డి, సురేష్ రెడ్డిలను సన్మానిస్తున్న అభిమానులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, అభిమానుల కోలాహలం నడుమ సూళ్లూరుపేటలో శుక్రవారం ఘనంగా జరిగాయి. దొరవారిసత్రం మండలం మావిళ్ల పాడులోని సతీష్‌రెడ్డి ఇంటి వద్దనుంచి కార్లు, మోటార్ల సైకిళ్ల ర్యాలీతో సూళ్లూరుపేటకు చేరుకున్నారు. హోలిక్రాస్ సెంటర్ వద్ద నుంచి అభిమానులు, నాయకులు కేరళ బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతం పలికి పూలవర్షం కురిపిస్తూ బాపూజీ వీధి మీదుగా ఆర్టీసీ బస్టాండు సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ భారీ క్రేన్ సాయంతో వేనాటి సతీష్‌రెడ్డి, ఆయన సోదరుడు వేనాటి సురేష్ రెడ్డిలను గజమాలలు సన్మానించారు. భారీ కేక్ కట్ చేశారు. అనంతరం కోళ్లమిట్ట వద్ద కూడా సతీష్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాపా మునిరాజా, రమేష్ రెడ్డి, భాస్కర్, సురేష్ రెడ్డి, బుజ్జయ్య, చంద్రశేఖర్, బాలకృష్ణ, జయచంద్ర, మణికంఠ, గాడి నారాయణ రెడ్డి, మురళి రెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్, జేఈఈ-2026 డిజిటల్ మెటీరియల్ సిద్ధం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నీట్, జేఈఈ-2026 పరీక్షలు రాయాలనుకుంటున్న విద్యార్థుల కోసం డిజిటల్ మెటీరియల్‌ను సిద్ధం చేసినట్టు ఐఐటీ - జేఈఈ, నీట్ ఫోరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. కాన్సెప్ట్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, గ్రాండ్ టెస్ట్‌లు ఉన్నాయని వెల్లడించారు. నీట్‌కు సంబంధించి మునుపటి టెస్ట్ అండ్ సొల్యూషన్స్, పేపర్స్, ర్యాంక్ బూస్టర్ టెస్ట్, ఎన్‌సీఈఆర్టీ నీట్ క్వశ్చన్ బ్యాంక్, టెస్ట్ సిరీస్‌ను పొందుపరిచినట్టు వివరించారు. మరింత సమాచారం కోసం అభ్యర్థులు నీట్-2026, జేఈఈ అభ్యర్థులు జేఈఈ 2026 అని టైప్‌చేసి 98490 16661కు వాట్సప్ మెసేజ్ పంపించాలని సూచించారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



చిన్నారి నృత్య ప్రదర్శన

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక మహతి కళాక్షేత్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. అనంతపురం అరవింద్ ఆర్ట్స్ అకాడమి సూర్యప్రసాద్ బృందం భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించింది. పలు భక్తిగీతాలకు చిన్నారుల నృత్యం కట్టిపడేసింది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సప్తగిరి మాసపత్రిక సీనియర్ ఉప సంపాదకులు అల్లాడి సంధ్య, ధర్మప్రచార పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల ఏర్పాటుకు చర్యలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తిరుపతి పరిధిలోని వర్తక, వాణిజ్య సముదాయాలు, షాపింగ్ మాల్స్, హోల్‌సేల్ దుకాణాల్లో తగ్గించిన జీఎస్టీ విధానాలు అమలుకు కంకణబద్ధులయ్యారు. ఇందులో భాగంగా తిరుపతిలోని కూడళ్లు, ప్రధాన రహదారులు, బైపాస్ రోడ్లు, షాపింగ్ మాల్స్ వద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఏయే వస్తువుకు ఎంత జీఎస్టీ తగ్గించారు.. గతంలో ఎంత ఉంది.. అతిక్రమిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది తెలిసేలా అందులో పొందుపరిచారు. రానున్న నెల రోజుల్లో జిల్లా అంతటా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు జీఎస్టీ సహాయ కమిషనర్ వరలక్ష్మి తెలిపారు.

యువ తరంగ్-2025కు రండి

మంత్రి రాంప్రసాదరెడ్డికి ఎస్వీయూ ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో అక్టోబరు 16 నుంచి చేపట్టే యువతరంగ్-2025కు అతిథిగా రావాలని మంత్రి రాంప్రసాదరెడ్డిని యూనివర్సిటీ కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ శుక్రవారం ఆహ్వానించారు. ఇందుకు మంత్రి సమ్మతించారు.